

28 నుంచి సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 28, 29, 30 తేదీల్లో ఏలూరులో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయని, ముఖ్య అతిథులుగా పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని పార్టీ ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నగర కమిటీ సమావేశం బి.సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ 26 జిల్లాల నుండి పార్టీ అగ్రనాయకత్వం ఈ సమావేశాలకు హాజరవుతుందన్నారు. ఈ సమావేశాల్లో భవిష్యత్ కర్తవ్యాలపై చర్చిస్తారని తెలిపారు. ఈ సమావేశాల నిర్వహణకు నగరంలో పెద్దలు, వ్యాపారులు వివిధ తరగతుల ప్రజలు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కిషోర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, ప్రసాద్, కనకారావు, అరుణ, హైమ పాల్గొన్నారు.

మిచౌంగ్ ముప్పు..!

నేడు మచిలీపట్నం, బాపట్ల వద్ద తుపాను తీరం దాటే అవకాశం

రెండు జిల్లాల్లోనూ ఎడతెరిపిలేని వర్షం

పశ్చిమలో 35 శాతం, ఏలూరు జిల్లాలో 45 శాతమే సార్వా మాసూళ్లు పూర్తి

60 శాతం పంట పొలాల్లోనూ, కళ్లాల్లోనే

దిక్కుతోచని స్థితిలో అన్నదాత

ముందస్తు జాగ్రత్తలపై అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావం జిల్లాను కుదిపేస్తోంది. ఎడతెరిపిలేని వర్షంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ముఖ్యంగా రైతుల పరిస్థితి అత్యంత ఘోరంగా మారింది. మంగళవారం మచిలీపట్నం-బాపట్ల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. దీంతో తుపాను ప్రభావం రెండు జిల్లాలపైనా తీవ్రంగా ఉండనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. ఇప్పటికే తుపాను ప్రభావంతో ఈదురుగాలులు, వర్షంతో జిల్లా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అన్నదాతకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. చేతికొచ్చిన పంట దక్కుతుందో లేదోనన్న ఆందోళన రైతులకు నిద్రలేకుండా చేస్తోంది. ఖరీఫ్ సాగులో 60 శాతం పంట పొలాల్లోనూ, కళ్లాల్లోనూ ఉండిపోవడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆరబెట్టిన ధాన్యం సైతం తడిసిముద్దవుతోంది. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా 1,93,398 ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా ఇప్పటి వరకూ 89,542 ఎకరాల్లో 45 శాతం మాత్రమే మాసూళ్లు పూర్తయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా ఇప్పటి వరకూ 30,600 ఎకరాల్లో 35 శాతం మాత్రమే మాసూళ్లు పూర్తయిన పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో సరాసరిన లెక్కిస్తే ఇంకా 60 శాతం పంట పొలాల్లోనూ, కళ్లాల్లోనూ ఉండిపోయింది. పంట చివరి దశలో మిచౌంగ్ తుపాను విరుచుకుపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. మాసూళ్లు చేసిన ధాన్యం సైతం రోడ్లపైన, కళ్లాలోనే ఉండిపోయింది. పశ్చిమగోదావరి జిల్లాలో 31 వేల టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండటంతో వెంటనే తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనలతో సంబంధంలేకుండా ఆఫ్‌లైన్‌లో రైతులు తమకు నచ్చిన మిల్లుకు తరలించుకోవచ్చని జిల్లా అధికారులు ఆదేశాలు జారీచేశారు. అయితే ఈ విధంగా విక్రయిస్తే తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కాకుండా, ఇబ్బందులు పడి, ధాన్యం సొమ్ము రాకపోవడం వంటి గత సంఘటనలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాకాలంలో నాలుగు నెలల్లో జులైలో మినహా మిగిలిన రోజుల్లో సరిపడా వర్షాలు కురవలేదు. తీరా పంట చేతికొచ్చే తరుణంలో తుపాను వెంటాడుతోంది. తుపానుతో విరుచుకుపడుతున్న ఈదురుగాలులకు ధాన్యంను కాపాడుకునేందుకు బరకాలు సైతం వేయలేని పరిస్థితి నెలకొంది. బరకాలు గాలికి ఎగిరిపోతున్నాయి. దీంతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. కోతకోయని పొలాలన్నీ గాలులకు నేలకొరిగిపోతున్నాయి. కళ్లాల్లో ధాన్యం కాపాడుకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది. పండిన పొలాలు కళ్లముందే నేలకొరుగుతుండటంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పంటను ఏవిధంగా కాపాడుకోవాలో తెలీక సతమతమవుతున్నారు. శని, ఆదివారాల్లో మాసూళ్లు చేసిన ధాన్యం తడిగా ఉండటంతో రాశులుగా ఉంచడం ఇబ్బందికరంగా మారింది. తడిధాన్యం కావడంతో మొలకలు వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇదే అదునుగా దళారులు అయికాడికి ధాన్యం అడుగుతున్నట్లు రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరాకు రూ.35 వేలకు పైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొచ్చే తరుణంలో విపత్తు సంభవించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



జిల్లాలో ధాన్యపు రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు

రబీ నారుమడులపైనా ప్రభావం

ఈ నెల 15వ తేదీకల్లా రబీ నారుమడులు పూర్తి చేయాలని అధికారులు చెప్పారు. దీంతో ఖరీఫ్ మాసూళ్లు పూర్తయిన ప్రాంతాల్లో తాడేపల్లిగూడెం, తణుకు, గణపవరం, పెంటపాడు, నిడమర్రు, ఉంగుటూరు వంటి అనేక మండలాల్లో రబీ నారుమడులు ముమ్మరంగా సాగుతున్నాయి. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నారుమడులు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. మరోసారి నారుమడులు వేయాల్సి వస్తుందేమోననే భయం రైతులను వెంటాడుతోంది. దీంతో రైతులు నారుమడులు వేయడం నిలిపివేశారు. తుపాను తీరందాటే సమయంలో జిల్లాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎంతమేరకు నష్టం చేకూరుస్తుందోననే భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు అప్రమత్తం

తుపాను ప్రభావం రెండు జిల్లాలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉందనే హెచ్చరికలతో అధికారులు అప్రమత్తయ్యారు. ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఆహారం, తాగునీరు వంటివి ముందస్తుగా సిద్ధం చేసుకుంటున్నారు. మాసూళ్ల చేసిన ధాన్యం మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. సచివాలయ, పంచాయతీ ఉద్యోగులు సెలవులు పెట్టకూడదని ఆదేశాలు జారీచేశారు. నిరంతరం అంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

మహిళలపై హింసను ఆపాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



హైమావతి



శ్యామలారాణి

ప్రస్తుత ప్రపంచవ్యాప్తంగా రోజుకు ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు హింసకు గురవుతున్నారని, ఎయిడ్స్‌ఐద్వా మహిళలపై హింస పెరుగుతూనే ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. ఐద్వా జిల్లా విస్తృత సమావేశం సోమవారం స్థానిక పవర్‌పేటలోని అన్నే అనసూయ భవనంలో ఐద్వా నాయకురాలు ఎం.వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమాదేవి మాట్లాడారు. గతనెల 25న ప్రారంభమైన మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం నుండి నుంచి ఈనెల పదో తేదీన మానవ హక్కుల దినోత్సవం వరకూ ఐద్వా ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. మనదేశంలోనే రోజుకు 86 హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. సగటున గంటకు 49 నేరాలు మహిళలపై జరుగుతున్నాయని, ప్రతి 70 నిమిషాలకు వరకట్న హత్య జరుగుతుందని తెలిపారు. 48 గంటలకు ఒక దళిత మహిళ హత్యాచారానికి గురవుతుందన్నారు. 76 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో ఆజాదీకా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో సగభాగంగా ఉన్న స్త్రీలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయడుతున్న ఆడుదాం ఆంధ్రాలో మహిళలకు ఎలాంటి ఆటలున్నాయో తెలపాలన్నారు. మహిళలకు ఆటపాటల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. అనంతరం ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పి.హైమావతి, ఎ.శ్యామలారాణిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎం.వరలక్ష్మి, ఎన్.పద్మాంజలి, జిల్లా జాయింట్ సెక్రటరీలుగా పి.వెంకటరమణ, ఎన్.నిర్మల, జిల్లా కమిటీ సభ్యులుగా జె.హరిప్రియ, ఎస్.మహాలక్ష్మి, పి.ఉషారాణి, జి.శారద, దివ్య, ఇందిర ఎన్నికయ్యారు.



ధర్నా చేస్తున్న బాధితులు

మోసపోయాం.. ఆదుకోండి

ఉద్యోగాలిప్పిస్తానని మోసగించిన వ్యక్తిని పట్టుకోవాలని బాధితుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు చేసి పరారైన టి.నరసింహాపై కేసు పెట్టి, బాధితులకు న్యాయం చేయాలని సిపిఎం, జనసేన పార్టీలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద నరసింహ చేతిలో మోసపోయిన నిరుద్యోగులు చేపట్టిన ధర్నాకు జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగుల దీనస్థితికి నరసింహ చేతిలో మోసపోయిన నిరుద్యోగులే ఉదాహరణ అని అన్నారు. ఏలూరుకు చెందిన నరసింహ తన కుమార్తె, బావమరిదితో కలిసి బోగస్ కంపెనీ పెట్టాడన్నారు. ఆ పేరుతో ఐసిడిఎస్ సంస్థలో అవుట్‌సోర్సింగ్ కార్యకర్తలు నుంచి సూపర్‌వైజర్లు, కో ఆర్డినేటర్ల, తదితర ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి, సుమారు 200 మంది వద్ద నుండి రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షలు వసూలు చేశాడన్నారు. డబ్బు చెల్లించిన నిరుద్యోగులు నెలలు గడుస్తున్నప్పటికీ తమకు ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారని ఒత్తిడి చేయడంతో నరసింహ పరారయ్యాడని తెలిపారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ తీస్తామని ఎన్నికల ముందు ప్రకటించిందని, కానీ దాన్ని అమలు చేయకపోవడం వల్ల రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించేలా స్థానిక ఎంఎల్ఎ, ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు, నిరుద్యోగుల పోరాట సంఘం నాయకులు కుమార్, బహుజన సేన నాయకులు మత్తే బాబీ మాట్లాడారు.



జీలుగుమిల్లిలో ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు

ముంచిన మిచౌంగ్..!

ప్రజాశక్తి - ముదినేపల్లి

మిచౌంగ్ తుపాను రైతులను నట్టేముంచింది. చేతికొచ్చిన పంట కళ్లముందే వర్షార్పణం కావడంతో ఏమిచేయాలో పాలుపోక రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలో ముమ్మరంగా కోతలు, నూర్పిళ్లు జరుగుతున్న తరుణంలో అకస్మాత్తగా వచ్చిన తుపాను రైతులను కోలుకోలేని దెబ్బకొట్టిందని లబోదిబోమంటున్నారు. ఈదురుగాలులు, భారీ వర్షానికి మండలంలోని చాలాగ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు నేలవాలింది. కల్లాల్లో, చేలగట్ల మీద, రోడ్ల వెంబడి యంత్రాలతో కోసి అరబెట్టిన ధాన్యాన్ని రైతులు పరదాలు కప్పి కాపాడునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున మొదలైన గాలి, వాన రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. దీంతో రైతులు ధాన్యపు రాశులపై పరదాలు కప్పి పంటను రక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో పరదాలకు గిరాకీ ఏర్పడింది. పలు గ్రామాల్లో కోసి పనలపై ఉన్న వరిపైరు వర్షానికి తడిసిపోయింది. వర్షాలు ఇలాగే కురిస్తే వరిగింజలు నీటిలో నాని రంగుమారి మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పనలపై ఉన్న పంటను కుప్పలు వేసేందుకు కూలీలు దొరక్క రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గాలులకు వరిపైరు నేలకొరగడంతో రైతులు మరింత అందోళన చెందుతున్నారు. మచిలీపట్నం వద్ద తుపాన్ తీరం దాటుతుందన్న హెచ్చరికలతో ముదినేపల్లి మండలం అత్యంత సమీపంలో ఉండడంతో మండల రైతాంగం గజగజ వణుకుతున్నారు.



ముదినేపల్లిలో పనమీద ఉన్న వరిపైరు

ముసునూరు: తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు అన్నదాతను నట్టేట ముంచాయి. మండలంలో సాగుచేసిన వరి, పత్తి చేతికొచ్చే సమయం కావడంతో ప్రస్తుత వర్షాలు తీవ్రనష్టాన్ని కలిగించాయి. రబీ సీజన్‌లో మొదలైన పొగాకు, మొక్కజొన్న, మిర్చి పంటలు వర్షం దెబ్బకు వేరుకుళ్లు తెగులు, పాసి తెగులు ఆశించి పంటలు పూర్తిగా కుళ్లి పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా నవంబర్, డిసెంబర్‌లో తుపాన్‌లు రావడం ప్రమాదకరమని వాపోతున్నారు.

జీలుగుమిల్లి : మిచౌంగ్ తుపాన్ రైతులను కలవర పెడుతోంది. మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా మోస్తరు వర్షం పడుతూనే ఉండటతంతో రైతులు తీవ్రఆందోళన చెందుతున్నారు. మండలంవ్యాప్తంగా కొన్ని వందల ఎకరాల్లో వరి, వేరుశనగ పంట చివరి దశకు చేరుకున్నాయి. ఈ సమయంలో తుపాన్ రావడంతో చేతికి వచ్చిన పంటలను ఒబ్బిడి చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అవేదన చెందుతున్నారు.

భీమడోలు: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో మోస్తరువర్షం కురిసింది. రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చేసిన ముందస్తు హెచ్చరికలతో అప్రమత్తమైన రైతులు రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. రెండు రోజులుగా వరి కోతలు నిలిపివేశారు. వ్యవసాయ క్షేత్రాల్లోని వరి పనలను కాపాడుకునేందుకు రక్షణ చర్యలు చేపట్టారు. సుమారు 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్లపై రాశులుగా ఉంది. మరో మూడు వేల టన్నులు పొలాల్లో ఉంది. ఈ క్రమంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆఫ్‌లైన్ ద్వారా, బ్యాంకు గ్యారెంటీతో నిమిత్తం లేకుండా సమీపంలో అందుబాటులో ఉన్న మిల్లులకు ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని తరలించేందుకు అనుమతించింది. తాజాగా సిఎం జగన్ తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం ఉదయం నుంచి భీమడోలు వ్యవసాయాధికారి పి.ఉషారాజకుమారి, ధాన్యం తరలించే విషయమై రైతులను అప్రమత్తం చేశారు. జిపిఎస్‌తో సంబంధం లేకుండా అందుబాటులో ఉన్న లారీలు, ట్రాక్టర్లతో ధాన్యం రవాణాకు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం వరకూ సుమారు 300 టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. వాతావరణం అనుకూలిస్తే మరో మూడు వేల టన్నుల వరకూ ధాన్యం తరలించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం సాయంత్రం వరకూ పాఠశాలలను మూసివేశారు. భీమడోలులో తాత్కాలిక హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు కొల్లేరు ప్రాంత ప్రజలను రక్షించేందుకు తగు చర్యలు తీసుకున్నారు. మండలంలోని మల్లవరం, చెట్టున్నపాడు, కోరుకొల్లు, ఆగడాలలంక, ఎంఎం.పురం గ్రామాల్లోని తుపాను రక్షిత భవనాలు శిథిలమైన నేపథ్యంలో పాఠశాలల్లో పునరావాసం కల్పించేలా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



తడిసిన వరి పనలను చూపిస్తున్న రైతులు, నాయకులు

తక్షణం సహాయక చర్యలు చేపట్టాలి : రైతు సంఘం

ఏలూరు అర్బన్: మిచౌంగ్ తుపాను ప్రభావంతో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలంలోని మల్కాపురంలో పనల మీద ఉన్న వరి పంటను రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. పనల మీద ఉన్న పంట తడిచి మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అన్నదాతలకు నష్టం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలులో రకరకాల ఆంక్షలతో ఇప్పటికే రైతులు ఇబ్బంది పడుతున్నారని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సకాలంలో వాహనాలు ఏర్పాటు చేయకపోవడం వలన కల్లాల్లోనే ధాన్యం ఉండిపోయిందని చెప్పారు. పంట చేతికి వచ్చే సమయంలో తుపాను అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో ఆంక్షలు తొలగించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు టార్పాలిన్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



ముసునూరు మండలంలో ఈదురుగాలులకు నేలవాలిన వరి

సమగ్ర శిక్షా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్షా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన మూడు నెలల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న సిఆర్‌పిలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, మండల లెవెల్ అకౌంటెంట్, మెసెంజర్లు, సహిత విద్య రిసోర్స్‌పర్సన్లు, ఫిజియోథెరపిస్టులు, హై స్కూల్స్, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి, పార్ట్ టైం టీచర్లు, జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్ట్ విధానాన్ని అమలు చేయాలని, రూ.50 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యుటీ కల్పించాలని, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఉద్యోగులు హేమ, విజయలక్ష్మి, శివరాం, రమేష్, రవి పాల్గొన్నారు.

'సైబర్' నేరగాళ్లకు చిక్కొద్దు: ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు చూసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మోసపోవద్దని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ప్రజలకు సూచించారు. అలాగే యువతలో మంచి స్ఫూర్తిని పెంచేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆమె అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె వినతులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్లో ఆదేశించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ సివిల్ సంబంధిత ఫిర్యాదులను న్యాయస్థానాల్లో మాత్రమే సరిచేసుకోవాలని ఆమె సూచించారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎస్‌పి ప్రశాంతి

సకాలంలో స్పందన అర్జీలు పరిష్కారం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - ఏలూరు

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఒతో పాటు జెడ్‌పి సిఇఒ కెఎన్ఎన్.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, హాజరై ప్రజలనుండి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 156 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ స్పందన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించాలన్నారు. ఆయాశాఖల వారీగా అందిన అర్జీలపై క్షేత్రస్థాయిలో కూడా విచారణ చేసి ఫొటోలతో సహా నివేదికలను అప్‌లోడ్ చేయాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కారతీరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ అర్జీలు రీఓపెన్ కాకూడదని, అలాగే పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డిఆర్‌ఒ

ధాన్యం కొనుగోలుపై రైతులు అధైర్య పడొద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెదపాడు

మించౌంగ్ తుపాను నేపథ్యంలో రైతులు ధాన్యం గురించి అధైర్యపడొద్దని ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి అన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు సోమవారం పెదపాడు మండలం వట్లూరు, పెదపాడు గ్రామాల్లో ఆర్‌డిఒ ఖాజావలి పర్యటించి ధాన్యం కొనుగోలు, కల్లాల్లో పంట పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పెదపాడు రైతు భరోసాకేంద్రంలో ధాన్యం కొనుగోలుకు అందుబాటులో ఉన్న వాహనాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వట్లూరులో పంట పరిస్థితిని ఆయన పరిశీలించారు. సిఎం జగన్ ఆదేశాలతో రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో సరళతరమైన విధానాన్ని అవలంభించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో పిపిసిల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వారికి తోడుగా నిలబడుతుందన్నారు. రోడ్డుపక్కన ఆరబెట్టిన ధాన్యాన్ని లారీల్లోకి లోడింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. పెదపాడు మండలం నుంచి సుమారు వంద మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించామని తెలిపారు. తుపాను ప్రభావం వల్ల ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులను, అధికారులను ఆయన అప్రమత్తం చేశారు. వీరివెంట తహశీల్దారు జి.విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్, విఆర్‌ఒలు, వ్యవసాయశాఖ అసిస్టెంట్లు ఉన్నారు.



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

వికలాంగులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - ఏలూరు

వికలాంగులకు న్యాయం సహాయం అందించడంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని సంస్థ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో రత్నప్రసాద్ స్థానిక దొండపాడులోని పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు అందరితో సమానంగా విద్యను అభ్యసించాలని, వారికి అన్ని రంగాల్లోనూ ప్రత్యేక రిజర్వేషన్ సదుపాయం ఉందన్నారు. చదువు నేర్చిన ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, అలాగే వారికి ప్రభుత్వ పథకాల్లో కూడా ప్రత్యేకమైన సదుపాయం కల్పించారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఇలాంటి పథకాలను పొందడంలో ఏ విధమైన న్యాయసహాయం కావలిసినా సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. స్కూలు ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు.



విద్యార్థులతో న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు

నేడు విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

ఏలూరు: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో ఈనెల ఐదో తేదీ మంగళవారం పాఠశాలలకు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సోమవారం తెలిపారు. అధికారులు, ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చే సూచనలు, సలహాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి : తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలలోని విద్యుత్ వినియోగదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎఇ పి.రవికుమార్ ఆదివారం ఒప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల విద్యుత్ మోటార్లు నీటిలో మునిగే అవకాశం ఉన్నందున ఆక్వా రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే భీకర గాలులకు సర్వీస్ వైర్లు తెగిపోయే అవకాశం ఉన్నందని విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడే అవకాశం ఉందన్నారు.

9వ తేదీలోపు అర్హులు ఓటరుగా నమోదు కావాలి


స్వాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తహశీల్దార్ ఇందిరాగాంధీ

ప్రజాశక్తి - భీమడోలు

అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఈనెల 9వ తేదీలోగా ఓటరుగా నమోదు కావాలని భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ కోరారు. భీమడోలులోని ఎస్‌కెపిఆర్ఎం కళాశాలలో ఓటర్లను చైతన్యపరచడం, భాగస్వామ్యం చేయటం(స్వాప్) కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహనా సదస్సును తహశీల్దార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలోని 53 పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఒల ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌లో 795 దరఖాస్తులు స్వీకరించామన్నారు. దీనిలో భాగంగా నూతన ఓటర్ల నమోదుకు 497, చనిపోయిన ఓటర్ల తొలగింపులు కోరుతూ 103, అభ్యంతరాలు తెలుపుతూ, మార్పులు కోరుతూ 195 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి ఈ కార్యక్రమాన్ని పరిశీలించారని తెలిపారు. మండల పరిధిలో మిగిలిన అర్హత కలిగిన ఓటర్లు తమ ఓటు హక్కు నమోదు కోసం సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాలు, ఆన్‌లైన్, ఇతర మాధ్యమాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.పద్మావతి దేవి మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాముఖ్యత, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమ్ కుమార్, ప్రిన్సిపల్ బాలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేయటం జరుగుతుందని మండల తహశీల్దార్ ఎల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ అక్టోబర్ 27వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటర్ లిస్టులోని అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో సవరణలు, చేర్పులు, మార్పులు చేస్తున్నామన్నారు. కొత్త ఓట్ల నమోదు కార్యక్రమం కూడా ఉంటుందని పేర్కొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నారాయణపురంలో లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ముస్తఫా ఆలీ, రవికుమార్ ఎన్నికయ్యారు. ఏలూరుకు చెందిన నంబూరి రాంబాబు జిల్లా కార్యదర్శిగా మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాంబాబు ఎన్నిక పట్ల మండల శాఖ అధ్యక్షులు పాటూరి సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఖాన్, మండల నాయకులు టి.ఆసయ్య, జి.మాధవీ లత, ఒ.ధనుంజయ రావు, పి.ప్రసన్న, పి.శ్రీనివాస్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

చింతలపూడి : యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎంవి.అప్పారావు, జిల్లా కార్యదర్శిగా పూరేటి శ్రీనివాసరావు, ఎంపికైయ్యారు. ఉంగుటూరులో జరిగిన యుటిఎఫ్ మహసభలో మండలానికి చెందిన పూరేటి శ్రీనివాసరావు, ఎంవి.అప్పారావు ఏకగ్రీవంగా ఎనికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు దామోధర్ మండల కమిటీ తరుపున అభినందనలు తెలిపారు.

ఉంగుటూరు: యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిలర్‌గా వివిధ స్థాయిల్లో పనిచేసిన సిహెచ్.శ్రీధర్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా రెండోసారి ఎంపికయ్యారు. ఆదివారం నారాయణపురంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా మహాసభలో రెండవసారి కూడా జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీధర్‌కు మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ఏలూరు టౌన్: నారాయణపురంలో సోమవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా నూతన కౌన్సిల్ సమావేశంలో ఏలూరు నగరం నుంచి రెండవసారి జిల్లా కార్యదర్శిగా ఈడే శివశంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ పర్వీన్ బేగం, జె.రాజారావు, గౌరవాధ్యక్షులు ఎం.చిట్టిబాబు, సహాధ్యక్షులు కె.దొరబాబు, పి.వాణిప్రసన్న, కోశాధికారి కె.కిరణ్ కుమార్, కార్యదర్శులు ఆర్‌విఆర్‌కె.వరప్రసాద్, టి.మారుతీ, కె..మహంకాళిరావు, మార్క్స మావో, డి.జగదీష్, కె.శ్రీనివాసరావు, డి.రామచంద్రరావు, కె.జయరాజు, కె.ఆనంద్, అడిటర్ సిహెచ్.షణ్ముఖి, పి.ప్రతాప్, పి.విజయలక్ష్మి, టి.రాజారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి.అప్పారావు అభినందనలు తెలిపారు.

తుపాను ప్రభావంతో పాఠశాలలకు సెలవులు

నూజివీడు రూరల్: తుఫాను ప్రభావంగా పాఠశాలలకు సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం వరకు సెలవు ప్రకటించినట్లు డివైఇఒ సేవియా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో సోమవారం మాట్లాడుతూ తుఫాను ప్రభావం కారణంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశానుసారం పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు.

గుండెపోటుతో టిడిపి కార్యకర్త మృతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని చక్రదేవరపల్లి గ్రామ వార్డు సభ్యుడు, టిడిపి సీనియర్ కార్యకర్త వైట్ల సత్యనారాయణ గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం చక్రదేవరపల్లి గ్రామంలో వైట్ల సత్యనారాయణ భౌతికకాయానికి గ్రామ సర్పంచి, టిడిపి మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు, గొడవర్తి నాగేశ్వరావు, గొడవర్తి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం: ఎర్ర కాలువ జలాశయ మిగులు భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి సముద్రాల బాల సుందరం డిమాండ్ చేశారు. సోమవారం ఎర్రకాలువ జలాశయ మిగులు భూములను భూమిలేని నిరుపేదలకు పంచాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రాల బాల సుందరం మాట్లాడుతూ వేగవరం, చెక్క దేవరపల్లి, దేవులపల్లి, తాడువాయిలో భూస్వాముల ఆధీనంలో ఉన్న జలాశయ మిగులు భూములను భూమిలేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు మద్దతు ఇవ్వకుండా భూస్వాములకు మద్దతిస్తున్న ఇరిగేషన్ డిఇని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ అద్దెయ్యకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలిండిపూడి సుందర్రావు, పిఒడబ్ల్యు నాయకులు పూణెం పార్వతి, నర్సక్క, పాయం భూలక్ష్మి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

భీమడోలు : భీమడోలు భవిత పాఠశాలకు చెందిన వికలాంగ విద్యార్థులను వివిధ రూపాల్లో ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని భీమడోలు మండల విద్యాధికారులు నెంబర్-1, 2 ఇ.శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ తెలిపారు. భవిత పాఠశాలకు చెందిన శిక్షకురాలు టి.రత్నకుమారి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాధికారులు వికలాంగ విద్యార్థులు అన్ని రంగాలలో అందరితో సమానంగా ప్రతిభా పాటవాలు కనపరచడం అభినందనీయమన్నారు. ఈ మేరకు వారు ప్రభుత్వం అందజేస్తున్న సహాయ, సహకారాలను వినియోగించుకోవాలని కోరారు. భీమడోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ప్రత్యేక అవసరాల విభాగ ఉపాధ్యాయురాలు అక్బరు న్నీసా బేగం భవిత పాఠశాలకు చెందిన విద్యార్థులకు మంజూరైన 8 టాబ్‌లను, ఇతరాలను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమడోలు ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమా భవిత పాఠశాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితో సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. ఇదే క్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 సంవత్సరపు 10వ తరగతి బ్యాచ్ విద్యార్థి చింతపల్లి వీరబాబు భవిత విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాలకు చెందిన శిక్షకురాలు కనకదుర్గ, భవిత పాఠశాలకు చెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించగలరు

ప్రజాశక్తి - ముసునూరు

అవసరాల గల విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో వున్నప్పుడే ఏదైనా సాధించగలరని ప్రధానోపాధ్యాయులు ఎం.హన్నామణి అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి బివి.సుబ్బారావు చేతుల మీదగా సోమవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఐఆర్‌టి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సైకిల్‌పై ఇంటికెళ్తున్న వ్యక్తిని ఐచర్ వాహనం ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రమణక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పండు శ్రీనివాస్(39) తన సైకిల్‌పై జీలుగుమిల్లి పని మీద వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తుండగా జీలుగుమిల్లి వైపుకి వస్తున్న ఐచర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్ది క్షణాల్లో ఇంటికి వెళ్లాల్సిన వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ఢీకొని వృద్ధుడు మతి చెందిన ఘటన ఏలూరు నగరంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని డోకల వారి వీధికి చెందిన పాము శ్రీనివాసరావు(59) సోమవారం ఉదయం పవర్ పేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలను దాటుతున్న సమయంలో గుర్తు తెలియని రైలు బండి అతనిని ఢీకొంది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ నరసింహారావు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

'స్పందన'లో ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

నూజివీడు రూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే అర్జీల రూపంలోని సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమ ఉద్దేశం ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, పరిష్కారం కాని సమస్యలను ప్రజలకు తెలియజేయాలని, ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయాలని అని తెలియజేశారు.

ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశాల పాత్ర కీలకం

ఏలూరు టౌన్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఆశా కార్యకర్తల పాత్ర చాలా కీలకమని, కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఆశా డే సందర్భంగా స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన పవర్ పేట, తంగెళ్ళమూడి, కొత్తపేటలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఆశా, ఆరోగ్య కార్యకర్తల సేవలు అభినందనీయమన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కల్పించాలని, తద్వారా డిపార్ట్మెంట్‌కి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గౌతమ్, డాక్టర్ అనూష, హెల్త్ సూపర్‌వైజర్స్ జాన్సీ, మార్తమ్మ, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌరవ వేతనం రూ.15 వేలు ఇవ్వాలి

ఉంగుటూరు: నిరంతరం ప్రజాసేవ చేస్తున్న పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలకు గౌరవ వేతనం రూ.15 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచి ఛాంబర్ అధ్యక్షుడు గోపాలరావు కోరారు. సోమవారం నియోజవర్గ స్థాయి ఛాంబర్ సమావేశం ఉంగుటూరు సామాజిక భవనంలో ఛాంబర్ అధ్యక్షురాలు, చేబ్రోలు సర్పంచి రాందే లక్ష్మి సునీత అధ్యక్షతన జరిగింది. మైనర్ పంచాయతీలకు విద్యుత్ బిల్లు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 11న ఏలూరులో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నామని గోపాలరావు పేర్కొన్నారు. అనంతరం లక్ష్మీ సునీత మాట్లాడుతూ విధులు కొరత వల్ల గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉంటుందని, ఆర్థిక భారం పడుతుందని వాపోయారు.

'ఆడుదాం ఆంధ్రా'ను యువకులు ఉపయోగించుకోవాలి

టి.నరసాపురం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని యువకులు ఉపయోగించుకోవాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు(సూరిబాబు) అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఉంచిన ఆడుదాం ఆంధ్రా ఆటలకు సంబంధించిన కిట్లను ఎస్ఐ సురేంద్ర కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించడానికి ముఖ్యమంత్రి చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతం అవ్వాలన్నారు. ఆటలకు సంబంధించిన కిట్లు మండలానికి వచ్చాయన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న యువకుల ప్రతిభ ఈ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా బయట పడతోందని, వారికి ప్రభుత్వం చక్కని అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

ధాన్యాన్ని మిల్లర్లు దిగుమతి చేయాలి : బేతపూడి



ముదినేపల్లి: రైస్ మిల్లులకు ధాన్యం దిగుమతుల కోసం రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతులు చేసుకోవాలని వైసిపి సీనియర్ నాయకులు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు బేతపూడి వెంకటరమణ కోరారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రైతులు అనేక వ్యయప్రయాసాల కోర్చి పండించిన తమ పంటను ఆర్‌బికెల నుంచి దిగుమతి కోసం మిల్లులకు తీసుకువస్తున్నారన్నారు. వాతవరణం పరిస్థితుల దృష్ట్యా మిల్లర్లు దిగుమతి విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రభుత్వానికి సహరించి రైతులను ఇబ్బంది పెట్టరాదన్నారు. గత ఏడాది కూడా రైతులు ఈ తరహాలోనే ఇదే నెలలో భారీ వర్షాలకు పంట నష్ట పోయారని, తేమశాతం అధికంగా ఉందంటూ మిల్లర్లు దిగుమతులకు నిరాకరించడంతో అధికంగా ఉన్న తేమశాతానికి అందుకు తగ్గ నగదు మిల్లర్లకు చెల్లించి ధాన్యం దిగుమతి చేశారన్నారు. రాష్ట్రానికి అన్నం పెట్టే అన్నదాతలకు ఇబ్బందులు కలిగించకుండా రైస్‌మిల్లర్లు ధాన్యం దిగుమతులు చేసుకొని ఇటు ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా, అటు రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం లోడులు వెంటనే దిగుమతులు చేసుకొని రైతులను ఈ విపత్తు నుంచి కాపాడాలని బేతపూడి వెంకటరమణ మిల్లర్లను కోరారు.

అంకితభావంతో పని చేయాలి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న దోసిరెడ్డి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సచివాలయ సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని ఎపిఎస్ఐఆర్‌డి జాయింట్ డైరెక్టర్ దోసిరెడ్డి పేర్కొన్నారు. ఐటిడిఎ పరిధిలోని ఏడు మండలాల్లో సచివాలయల సిబ్బందికి రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా జీలుగుమిల్లి ఎంపిడిఒ కార్యాలయం, వెలుగు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సచివాలయ ఉద్యోగుల శిక్షణా తరగతులలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలలో జరిగే పాలనకు ఎంతో గుర్తింపు వచ్చిందని, దానికనుగుణంగా సిబ్బంది అందరూ అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఈ శిక్షణా శిబిరాలు భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తెలిపారు. ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 273 మంది వరకూ సచివాలయ సిబ్బంది ఈ శిక్షణా తరగతులకు హాజరవుతున్నారని, వారిని పంచాయతీల వారిగా బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి, విడతల వారీగా ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. దీనిలో భాగంగా సిసిఎ రూల్స్, సాఫ్ట్‌వేర్ ప్రాబ్లమ్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్స్, డ్రెస్ సర్వే, సబ్జెక్టులపై పంచాయతీ రాజ్‌లో శిక్షణ పొందిన వారితో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మంగతాయారు, ఇఒపిఆర్‌డి నిఖిల్ సాయి శరణ్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫారాల వితరణ


విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న సుబ్బారావు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని శ్రీసత్యసాయి బాలభారతి విద్యాలయంలోని విద్యార్థులకు సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు వారి ఆధ్వర్యంలో రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు 100 మంది విద్యార్థులకు యూనిఫాం, రూ.50 వేల నగదు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు గొల్లపూడి రవిబాబు, కార్యదర్శి పిడి.వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం


ఆర్థిక సాయం చేస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటమే నిజమైన మానవత్వమని మాజీ సొసైటీ ఛైర్మన్ ఆత్మూరి సుబ్బారావు అన్నారు. పట్టణంలో గత 3 రోజుల క్రితం సుప్రియన్ పేటలో చెట్టు విరిగి చనిపోయిన హెచ్చు శ్రీను కుటుంబాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పరామర్శించి, ఆర్థిక సహాయంగా మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు గౌరవ డైరెక్టర్ ఎ.సత్యనారయణ, చింతలపూడి సొసైటీ మాజీ ఛైర్మన్ ఎ.సుబ్బారావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఛైర్మన్ ఎ.అప్పారావు, కో ఛైర్మన్ ఎం.శామ్యూల్, అధ్యక్షులు పి.సోమశేఖర్, కన్వీనర్ కె.నాగ చిన్నారావు, కమిటీ సభ్యులు ఎస్.కిరణ్ బాబు, కె.రాంబాబు, పి.కిషోర్(మీడియా), చింతలపూడి ఎఎంసి మాజీ డైరక్టర్ కె.ఏలియ, స్థానికులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసులో విచారణ వేగవంతం

ఎస్‌పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మైనర్ బాలిక ఆత్మహత్య ప్రయత్నం కేసులో విచారణ వేగవంతం చేశామని, పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలూరుపాడు మండలం రాళ్లపాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలిక ఆదివారం సాయంత్రం ఇంటి వద్దనే ఒంటిపై కాలిన గాయాల పాలై పడి ఉండగా చుట్టుపక్కల చూసిన వారు పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం ఏలూరు సరోజన ఆస్పత్రికి తరలించారు. ఏలూరులో బాలికను పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌పి స్పందించి ఆదివారం రాత్రి బాలికను ఏలూరు సరోజన ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పొందుపరిచిన అంశాల ప్రకారం ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాలిక పదో తరగతి పరీక్షలకు హాజరు కాకపోవడంతో తల్లిదండ్రులు, అటు ఉపాధ్యాయులు తనను ఏమైనా అంటారేమోనని అపోహతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. బాలురు, బాలికలు, యువకులు ఈ మధ్యకాలంలో చిన్న, చిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా వారి కదలికలపై నిగాపెట్టాలన్నారు. యువకులు చిన్న చిన్న విషయాలకు ఒత్తిడికి లోను కావద్దని ఆమె సూచించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు


పోలవరం:ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎడి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో సోమవారం నాటికి 600 మెట్రిక్ టన్నుల ధాన్యం కోత కోసి రాశులపై ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందని పోలవరం మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు తెలిపారు. మండలంలో రాసులపై ఉన్న ధాన్యాన్ని ఆయన సోమవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాసులపై ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని ప్రభుత్వం, అధికారుల ఆదేశాలతో సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. కావున రాశుల మీద ఉన్న ధాన్యానికి సంబంధించిన రైతులందరూ సంబంధిత రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి తెలియజేసి ధాన్యం మిల్లుకు పంపించే విధంగా సహకరించాలని కోరారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది నేరుగా మీ క్షేత్రాలకు వచ్చి సహకరిస్తారని తెలిపారు. మండలంలో 6,143 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేయగా 1,900 ఎకరాలు కోతలు కొయ్యడం జరిగిందని, ఇప్పటి వరకు 2,300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.

తుపాను కారణంగా ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వరి రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పంటనష్టం నివారించుకోవాలని సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు జి.వెంకట మణి కోరారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని రైతులు చేపట్టవలసిన పనులపై అవగాహన కలిగించే ఉద్దేశంతో ఆమె మండలంలోని కొర్రగుంటపాలెం, సింగరాయపాలెం, శ్రీహరిపురం, వడాలి గ్రామాల్లో సోమవారం పర్యటించి వరిపైరును పరిశీలించి రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తుపాను పరిస్థితి ఉన్నందున పంటకోతలు మరో మూడు రోజుల పాటు వాయిదా వేయాలన్నారు. అదేవిధంగా తుపాను దృష్ట్యా ధాన్యం తరలించడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చినందున రైతులు వెంటనే సమీపంలోని రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.


ఆగిరిపల్లి : ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎడి చెన్నారావు

ఆగిరిపల్లి : రాశులపై ఉన్న ధాన్యంను ఆఫ్‌లైన్ పద్ధతిలో ఈనెల 5వ తేదీలోపు పిఎసిఎస్, డిసిఎంఎస్, ఆర్‌బికెలకు తరలిచండానికి సివిల్ సప్లై శాఖ కల్పించిన అవకాశాన్ని వరి ధాన్యం రైతులందరూ సద్వినియోగపర్చుకోవాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు కోరారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఆయన మండలంలోని వరిపోలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోసి పనల మీద వున్న రైతులు ధాన్యం మొలకెత్తకుండా లీటరు నీటికి 5 గ్రాముల ఉప్పుని కలిపి పిచికారి చేయాలని, ధాన్యం రంగు మారకుండా వుండటానికి మ్యాంకోజెబ్, కార్బండిజం లీటరకు నీటికి 2 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఆర్.వెంకటలక్ష్మిలు పాల్గొన్నారు.

పట్టిసీమ వీరేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా పరిషత్ ఛైర్మన్

పోలవరం: మండలంలో పట్టిసీమ నిధిపై విచ్చేసి ఉన్న వీరేశ్వర స్వామిని కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. వారిని ఆలయ మర్యాదలతో గౌరవించడం జరిగిందని ఆలయ కార్య నిర్వహణాధికారి సంగమేశ్వర శర్మ తెలిపారు. సోమవారం సుమారు 2,500 మంది భక్తులు స్వామివారిని దర్శించి, వెయ్యి మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించి ఉన్నారని తెలిపారు. ఆయన వెంట పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, గూటాల సొసైటీ ప్రెసిడెంట్ సుంకర అంజిబాబు, వైసిపి జెఎసి మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయిరాం, ఆలయ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా క్రిస్టియన్న, అంజమ్మ

చింతలపూడి : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ జిల్లా మహాసభలో జిల్లా గౌరవ అధ్యక్షులుగా కౌలూరి సైదా, జిల్లా అధ్యక్షులుగా క్రిస్టియన్న, ప్రధాన కార్యదర్శిగా గంధం అంజమ్మ ఎన్నుకున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు తెలిపారు. చింతలపూడి మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలో ఈక్రింది తీర్మానాలను ఆమోదించారని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు పెంచాలని, సర్వీస్‌లో ఉండి చనిపోయిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో జిల్లా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులుగా భద్రమ్మ, ఎం.సరోజినీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా జబీర్, హరీష్

ప్రజాశక్తి - ఏలూరు


జబీర్


హరీష్

ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్షులుగా ఎస్‌డి.జబీర్, కార్యదర్శిగా వైవి.హరీష్, ఉపాధ్యక్షులుగా కె.సోమశేఖర్, పి.గంగరాజు, యర్రా జయదాసు, లతీఫ్, మరో ముగ్గురు, కోశాధికారిగా చిన్నరావు ఎన్నికయ్యారు. అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ మహాసభకు జిల్లాలో ఏడు నియోజకవర్గ పరిసర ప్రాంతాల నుంచి వివిధ పత్రికల్లో, సాటిలైట్ ఛానల్స్‌లో పనిచేస్తున్న సుమారు 400 మంది పాత్రికేయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు వి.నవీన్ రాజు, జిల్లా అడహాక్ కమిటీ సభ్యులు కె.బాలసౌరి, ఎన్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం
తర్ఫీదుల్లో ట్రైనీ డిఎస్‌పి విద్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ట్రైనీ డిఎస్‌పి విద్య నగరంలోని స్టేషన్లలో పలు విభాగాల విధుల తర్ఫీదు అనంతరం జంగారెడ్డిగూడెం ఎస్‌హెచ్‌ఒ విధుల తర్ఫీదు నిమిత్తం ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెంకు వెళ్లారు. నూతనంగా గ్రూప్ వన్ ఆఫీసర్‌గా అందులో డిఎస్‌పిగా విధులు చేపట్టారు. డిఎస్‌పిగా విధులు చేపట్టిన అనంతరం తొలుత వీరు పలు విభాగాలలో పోలీసు విదులలో తర్ఫీదు పొందవలసిన అవసరం ఉంటుంది. ఇందులో భాగంగా ఏలూరు నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రైటర్ విధులు, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులు, రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ విధులు ఆమె సిబ్బంది ద్వారా తెలుసుకొని ఆ విధులు నిర్వహించారు. ఈ విధులతో పాటు వారు నిర్వహించే బందోబస్తు విధులు కూడా ఆమె తెలుసుకుని విధులను నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో విధుల తర్ఫీదు పొందేందుకు జంగారెడ్డిగూడెం వెళ్లారు.